# రికార్డింగ్ డాన్సులు

దేవీ నవరాత్రుల్లు సందర్భంగా ఏజన్సీ ఏలేశ్వరంలో, హనుమాన్ సెంటర్ పందిట్లో, రికార్డింగ్ డాన్స్ జరుగుతోంది ఆ డాన్స్ కంపెనీ ఓనరు, స్టేజీ పక్కన కూర్చోని రికార్డులేస్తున్నాడు. కంపెనీ హీరోయిన్ గంగ, హీరో పైడిరాజు, ఆ రికార్డుల కనుగుణంగా స్టేజిమీద డాన్స్ చేస్తున్నారు 'సిరిపురం సిరిసిరి మువ్వా సూపర్ సినీ రికార్డింగ్ డాన్స్ కంపెనీ' తూర్పు గోదావరి జిల్లా అంతటా పేరు బడ్డదే అయినప్పటికీ ఎందుకనో, ఆ కిందటి రోజు హరికథకొచ్చిందానికన్నా తక్కువే వచ్చారిప్పుడు జనం.

ఓనరు తెలివైనవాడు. సినిమా యాక్టర్లని బట్టి సినిమా పాటలు ప్రచారంలో కొస్తున్న రోజులివ్వని జ్ఞాపకం తెచ్చుకున్నాడు కనక అంతవరకు తను వేస్తూ వచ్చిన ఘంటసాల పాటల్ని ఆపేశాడు. కొత్త పాటలందుకున్నాడు.

మొదటగా 'పసివాడి ప్రాణం'లో పాటేశాడు:

'కాశ్మీరు లోయలో, కన్యాకుమారిలో ఓ చందమామ!

కన్నె ఈడు మంచులో, కరిగే సూరీడులో ఓ చందమామ!

పొగరాని కుంపట్లు రగిలించినాడె,

పొగరెక్కిన చలిగాడ్ని తగిలేసినాడే,

చెమ్మా చెక్కా చేతాచిక్కా!

మంచమల్లె మారిపోయె మంచు కొండలు మంచిరోజు మార్చమంది మల్లెదండలు!

.. . ... ఆ సినిమాలో చిరంజీవి, విజయశాంతిల జంటచేసిన డాన్సుకి ఇక్కడ ఈ జంట చేసే డాన్సుకీ పోలికే లేదు. ప్రేక్షకులకి మత్తెకించి నాలుగు డబ్బులు ఇంకో పది బుకింగులూ తెచ్చుకోటమే ముఖ్యం కనక అందుకు తగినట్టుగానే వీళ్ళు కదుల్తున్నారు

'మందార బుగ్గల్ని చిదిమేసుకో' అన్నప్పుడు గంగ విజయశాంతిలాగా తన ఎడం భుజం పైకెత్తి పక్కవాటుగా వంగి తన ఎడమ బుగ్గని పైడిరాజు మొహం మీదికి తోసింది. పైడిరాజు ఆమెని చటుక్కున వాటేసుకున్నాడు. అంతే! జనంలోంచి ఈలల్లేచాయి.

అంతవరకూ నీరసంగా ఉన్న పైడిరాజులో హుషారొచ్చింది. వెంటనే స్టెప్పులేస్తూ 'పెళ్లికాకముందే పేరంటమూ' అంటూ ఆమెని మళ్లీ పొదివి పట్టుకొని, చటుక్కున హత్తుకున్నాడు. సన్నగా 'ఉహుహూఁ' అన్నాడు. ఆ సౌండును మైకు లాగింది జనం మళ్లీ ఈలలేశారు పైడిరాజు మరింత హుషారుగా స్టెప్పులేశాడు.

ఈ పాట పందిట్లో రగిలించిన 'కుంపటి' వృథా పోలేదు ఇది పూర్తయ్యే సమయానికి కొత్త జనం వచ్చిపడ్డారు.

కొత్తపాట మొదలైంది

'సిగ్గూ పూబంతీ, విసిరే సీతా మాలచ్చీ,

'మొగ్గా సింగారం, విరిసే సుదతి మీనాక్షి సొగసూ సంపెంగా, గుత్తులు మెత్తగ తాకంగా రామూని చిత్తంలో, కామూడు చింతలు రేపంగా...'

ఇది స్లో మూవ్ మెంటున్న పాట గంగ కిష్టమైన పాట కానీ స్టెప్పులకి ఎక్కువ అవకాశం లేకపోవటం చేత పైడి రాజుకు అంతగా నచ్చని పాట కనక పైడిరాజులో ఊపు తగ్గింది. గంగలో హెచ్చింది. 'సుకుమారి ఈ చిన్నదేనా, శివుని విల్లు మోసిన జాణ ఈ చిన్నదేనా' అని పైడిరాజు గంగ వీపూ తలా నిమిరినప్పుడు గంగకి అతన్లో చిరంజీవి కనిపించి ఆమె పులకించిపోయింది.

చివరి చరణం, 'ముసురుతున్న రామయరూపు, మెరిసే నల్లమబ్బయినాడే వలపుకన్న వరదయినాడే' అన్నప్పుడు పైడిరాజు, స్టూలు మీద ఒక కాలుంచి, రెండోవైపు చేతిని తన నడుం మీద ఆన్చి, తల వెనుక్కు విసిరేసి చూశాడు అతన్లో ఆమెకి మళ్లీ చిరంజీవి మెరిశాడు. ఆమె పరవశించిపోయింది.

పైడిరాజు, మళ్లీ పల్లవి అందుకొని ఆమెని దగ్గరికి తీసుకోగానే ఆమె, తాను వెనక్కి వంగి, అతని మొహాన్ని తన వీపువైపు నించి వంచి, తన మొహం మీదికి తెచ్చుకుంది. అతను ఆమెని వెనకనించే కౌగలించుకొని ఆమె గుండెల మీద ముద్దు పెట్టుకున్నాడు. ప్రేక్షకుల హుషారు గోలతో పందిరి మోగిపోయింది!

పందిట్లో జనం రెట్టింపయ్యారు. ఈసారి మళ్లీ ఫాస్ట్ నెంబర్ వేశాడు ఓనరు.

'మంచమేసి దుప్పటేసి మల్లెపూలు చల్లాను రాజా

తెల్లచీరె కట్టాను వెన్నదొంగలించాను రారా

దిండు ఎంత మెత్తనో మంచమెంత గట్టిదో, చుక్కలొంక చూసుకుంటూ సొమ్మసిల్లిపోదాము రారా... .. .. '

పాట మొదలవ్వగానే జనంలో కలకలం మొదలైంది ఝుమ్మని ఈలలల్లేచాయి. పైడిరాజుకి హుషారు ఝుంగుమని లేచింది. 'పండు ఎంత తియ్యనీ పాలు ఎంత చిక్కనో' అన్నప్పుడు పైడిరాజు స్టెప్పు లేస్తూ చటుక్కున తల వెనక్కి ఎగరేసి హ్హా అని వెంటనే నీళ్ళు ధారపోస్తున్న తీరులో అరచేతిని తన ముందువైపు పైనించి కిందికి ఆడించాడు.

జనంలోంచి ఈలల్తో పాటు, చప్పట్లు కూడా అదిరిపోయాయి. పైడిరాజు స్టెప్పుల్లో కొత్త జీవం తన్నుకొచ్చింది. 'చీకిటింట చిట్టి గుండె కొట్టుకున్నది' అంటూ గంగ బుంగమూతి పెట్టి చేతులు వెనక్కి కట్టుకుని తన గుండెల్ని ముందుకూపుతూ మీదిమీదికొచ్చింది. అతను, తన ఎడం చేతిమీదికి ఆమె తన వీపు మీద ఆనేట్టు చేసి, ఆమె కాళ్ల మీంచి చేత్తో రాస్తూ మోకాళ్లదాకా చీర పైకెత్తి, ఆమె కంఠంమీద ప్చ్, ప్చ్ అని ముద్దు పెట్టుకున్నాడు.

జనం వెర్రెత్తిపోయారు. చప్పట్లూ ఈలల్తో పందిరి అదరగొట్టేశారు. జనం రెచ్చినకొద్దీ పైడిరాజు రెచ్చిపోయాడు తన స్టెప్పుల్లో . అక్కణ్ణించి చరణం చరణానికి జనం చప్పట్లు కొడుతూనే ఉన్నారు. పాట అయిపోయే సమయానికి నేల ఈనినట్లు పందిరంతా జనమే జనం!

విశ్రాంతి తర్వాత సెలయేరులాంటి కొత్త పాట మొదలైంది
'బంతీ చామంతీ, ముద్దాడుకున్నాయిలే!
మల్లీ మందారం, పెళ్ళాడుకున్నాయిలే
ఇద్దరినీ సెలవడిగి, ఇద్దరినీ కలవమనీ ప్రేమ వాగుల్లో, మల్లె పూలల్లే, తేలిపోదాములే
'గాలివానల్లో మబ్బు జంటల్లే తేలిపోదాములే .. ..'

ఇది గంగకి ప్రాణమైన పాట అక్షరం అక్షరానికి చిరంజీవి తన్నుకొస్తాడు ఆమె మనస్సులోకి ! పైడిరాజుకైతే ఇది చిరాకైన పాట. అందుకనే ఇప్పుడు అతని స్టెప్పులు తగ్గాయి కానీ యాక్షన్ తప్పదుగదా! కనక 'ముసిరే వయసులలో మతి పోతుంటే వేడెక్కి గుండెల్లో తలదాచుకో పాలలో వెన్ను తడి అర్చుకో!' అన్నచోట, పైడిరాజు, గంగ తలని తన గుండెలకి అదుముకొని ఆమె చెక్కిలినీ భుజాన్నీ మృదువుగా తడిమాడు.

గంగకి ఆ తడిమింది పైడిరాజు కాదు. చిరంజీవి! ఆమె హఠాత్తుగా స్వర్గం అంచుకెగిరిపోయింది! ఆ పైన యాక్షన్లో ఆమె పేట్రేగిపోయింది! 'ఎర్ర ఎర్రంగా కుర్ర బుగ్గలో సిగ్గు రేగిందిలే!' అన్నప్పుడు ఆమె తన రెండు చేతులూ జోడించి, చెక్కిలికి ఆన్చి తలవంచి, క్రీగంటితో పైడిరాజును- కాదు కాటు చిరంజీవిని చూసింది. అతనామెను పొదివి పట్టుకున్నాడు. ఆమె మెల్లిగా నేలమీదికి జారింది. అతను ఆమె మీదికి వాలాడు. 'కాలాలు కరిగించి కౌగిళ్ళలో, దీపాలు వెలిగించు నీకళ్ళలో' అన్నప్పుడు ఆమె కసిగా చూస్తూ చిరంజీవిని చటుక్కున తన మీదికి లాక్కుంది. చేతుల్లో పట్టు తప్పి పైడిరాజు ఆమె మీదకి అడ్డంగా పడిపోయాడు! పిచ్చెత్తిపోయారు సదరు ఏలేశ్వరం ప్రేక్షక మహాశయులు! ఫర్లాంగుదాకా ఇసకేస్తే రాలనట్టు మూగి పోయున్న ఆ జనం గోలతో ఆ చోటంతా దద్దరిల్లి పోయింది. గుంజల పందిరి ఊగూగి పోయింది. స్టేజీ మీదికి రూపాయి బిళ్ళలు ఉప్పెనొచ్చినట్టు వచ్చి పడ్డాయి! హీరో హీరోయిన్లిద్దరూ ప్రేక్షకులికి వినయంగా నమస్కరించారు. విశ్రాంతి కోసం తెర వెనక్కెళ్ళిపోయారు. పోగుబడ్డ రూపాయిల్నీ, అప్పటి కప్పుడే టపటపా వచ్చిపడ్డ ఇంకో అరడజను బుకింగుల్ని చూసుకుని మురిసిపోయాడు ఓనరు. వరస క్రమంలో ఈ సారి ఇంకో ఫాస్ట్ నెంబర్ వేసేందుకు సిద్ధపడ్డాడు.

ఓనరుకు తెలుసు, ఏ ఏ పాటలేస్తే తన హీరో హీరోయిన్లిద్దరూ ఎట్లా ఎట్లా స్పందిస్తారో! చప్పట్లు ఎంత బాగా మోగితే అంత గొప్పగా పైడిరాజుకి స్టెప్పులు పడతాయి. కనక అతని కోసం ఒక స్టెప్పులున్న పాట, చిరంజీవి స్ఫురించినప్పుడల్లా తన గంగ పేట్రేగిపోతుంది. కనక అందుకు వీలుగా ఆమెకి మనసైన ఒక అనురాగం పాట ఇట్లా పాటల్ని మార్చి మార్చి వేసి జనం నుంచి డబ్బు గుంజటం అనే బాట ఆ ఓనరుకు తెలిసిట్లుగా మరే కంపెనీ ఓనరుకూ తెలీదేమో! ఆ కిటుకు తెలుసుకున్నాడు కనుకనే అతగాడు గుండెమీద చెయ్యేసుకుని తన కంపెనీ పేర్లో 'సూపర్' చొప్పించుకున్నాడేమో!

స్టేజి వెనకాల పాకలో మేకప్ విప్పుకుంటూ పైడిరాజుతో అంది గంగ " వొచ్చే నెల నాపెళ్ళి.. అట్టెండరంట... చిరంజీవిలాగుంటాడంటలే!" పైడిరాజన్నాడు " నాకూ కుదిరినాదిగా. చదూకున్నాదంట! ప్రతీ సినిమానీ యిడమర్చి మెచ్చుకుంటాదంట!"

నిజానికసలు ఈ ఇద్దరూ పెళ్ళి చేసుకోవచ్చు కానీ గంగ ఇరవైరెండేళ్ళదీ, పైడిరాజు పద్దెనిమిదేళ్ళ వాడూను. పైగా ఒక కులం కూడాకాదు. అసలయినా ప్రతివాడూ తన సొంత వృత్తిని ఈసడించుకోటం సహజం కదా!

గంగకి పైడిరాజుకి పెళ్ళిళ్లయ్యాయి.

గంగతో సంసారంలో మొదటి రాత్రి ఆమెకి దగ్గరగా రాబోయాడు. ఆమె అటెండరు భర్త.

గంగ అంది " మీరు ఇంకొంచెం స్టైల్‌గా కదల్లేరేటి?"

" స్టైల్‌గానా అంటే?" ... " స్టెప్పుతో" ... " స్టెప్పా!" తెల్లబోయాడు ఆ భర్త.

" అదే అందరూ యేస్తా వుంటారు! ... అంటే ... అదే, చిరంజీవిలాగన్నమాట! అట్టాగ !". " హీరో చిరంజీవిలాగానా ! ... పడగ్గదంటే సినిమా అనుకున్నావేటి! ... అసలయినా చిరంజీవికి నీకు ఏటి సంబంధమంట?"

గంగ బిత్తరపోయింది. మరి మాట్లాళ్లేదు. 'చిరంజీవిలాగా పుల్లుగా కాకపోతే పోనియ్యి. పావలా ఎత్తయినా స్టెప్పులు రాకోకుండా ఎట్టా వుంటారబ్బా యీ హిందూ దేశంలో మొగోల్లు!'' అనుకుంటూ దిగాలుపడిపోయింది!

అక్కడి పైడిరాజు, తన భార్యతో మొదటిసారి ఏకాంతంలో గడుపుతూ ఆమెని మెడమీద ముద్దు పెట్టుకున్నాడు. "ఎట్టా వుంది?" అన్నాడు.

ఆమె తేలితేలిపోతూన్న తన అరమూత కళ్లని పూర్తిగా తెరిచి. 'ఏంట'న్నట్లు చూసింది.

"నాముద్దు" ఆమె మాట్లాళ్ళేదు. కాస్సేపయ్యాక పైడిరాజు ఆమెని, ఆమె వీపు మీదగా వంచి తన ఎడం చేతి మీదికి వాల్చుకున్నాడు. ఏంచెయ్యబోతున్నాడో తెలీక బిక్కుబిక్కుమంటూ ఆమె వంగింది. పైడిరాజు ఆమె కంఠం మీద ముక్కుతో రుద్దాడు. రుద్ది రుద్ది చటుక్కున "ఎట్టా ఉంది?" అన్నాడు.

ఆమె మళ్ళీ మత్తులోంచి కళ్ళు తెరిచింది. తెల్లబోతూ "ఎట్టా వుంటమేటి?" అంది.

"అహఁ, అది కాదు, సినిమాల్లోనూ, నాటకాల్లోనూ హీరో హీరోయిన్లు లవ్వాడుకుంటా వుంటే జనం చప్పట్లు కొట్టి సెబాస్ అనీ ఎట్టా వుందో చెబుతారుగదా! మాటొరసకి యిప్పుడు భానుప్రియ వున్నాదనుకో..."

సర్రున లేచిందామె !" యిదిగో, యావఁయ్యోయ్, యిహ యిప్పటేల్నించీ బానుప్రియ, సందుప్రియ యేసాలేం కుదరవ్! బుద్ధిగా యేలుకుంటానంటేనే వుంటా! లాపోతే మావోల్లందర్ని పిలిపిచ్చి సంగతేటో తేల్చుకుంటా!"

బిత్తరపోయాడు పైడిరాజు. 'చప్పట్లు లేకుండా సరసమెట్టా సాగుతాది, కాపరం యెట్టా యెల్లమారతాది!' తికమకబడుతూ అనుకున్నాడు.

నెల తర్వాత జగ్గంపేట తిరణాల్లో ఈ హీరో హీరోయిన్లిద్దరూ మళ్ళీ డాన్సాడారు. జనం విరగబడి పొగవటంతో వీళ్ళిద్దరూ విపరీతంగా రెచ్చిపోయి ఆడారు.

ఆ రాత్రి ఇంటికొచ్చాక గంగ, తన భర్తతో మొదటిసారిగా రెచ్చిపోయి కలిసింది! పైడిరాజు తన భార్యతో పిచ్చిగా ఐక్యమయిపోయాడు:

ఓ రాత్రివేళ ఇక్కడ గంగ భర్త లేచి కూర్చుని, 'అదీ కిటుకు. చిరంజీవిని తలుసుకుంటేనే గాని యీ అమ్మోరమ్మకి వూపు రాదన్నమాట. నేనిప్పుడు చిరంజీవిలాగ ఎట్టా మారటంరా దేవుడో:'

అక్కడ పైడిరాజు భార్య అనుకొంది 'ఇదా సంగతి, యీన సరసవాడినప్పుడల్లా చప్పట్లూ యీలలూ మోగాలన్నమాట!... పడగ్గదిలోకి జనాన్నెట్టాగ తోలుకురాన్నాయనో!'

ఇద్దరూ చెరొక చోటా తలలు పట్టుక్కూర్చున్నారు !!!

(స్వాతి సపరివారపత్రిక 13-4-90)

★★★ ★★★ ★★★